# డీల్ షో

'రతన్'



పదమూడు ముక్కలు చేతిలో రెప రెపలాడుతూ వుంటే అప్పారావుకు యుగాలు క్షణాల్లా గడిచి పోవడమే కాకుండా — ఆకలి, దప్పి, నిద్ర దరిదాపులకు కూడా రాలేవు. తనకో పెళ్ళాం, ఇద్దరు పిల్లలూ వున్నారనే విషయం కూడా జ్ఞప్తికి రాదు అప్పారావుకు. అతను ఇంటి మొహం చూసి అప్పటికి వారం రోజు లయింది.

పట్టువదలని విక్రమార్కుడిలా ప్రతి ఆటా తీస్తున్నాడు. ఎదుటివాడికి "షో" అయ్యే ముందు తెలివిగా గమనించి మిడిల్ డ్రాప్ చేస్తున్నాడు. గత ఐదు ఆటల నుంచీ అదే విధంగావుంది అప్పారావు ఆట. "ఛీ ఛీ... వెధవ పేక" అని తిట్టుకుంటూ ఆరో ఆట ముక్కలు చేతిలోకి తీసుకున్నాడు. కానీ ఈ ఆట అద్భుతంగా పడింది. "డీల్ షో"కు పెట్టి ఎదుటి వాడిని తొందరగా డిస్ కార్డింగ్ చెయ్యమని తొందర పెడుతూ తన ఆటకై ఎదురు చూస్తున్నాడు. ఇంతలో ప్రక్కనుంచి "నాన్నా" అనే పిలుపు వినిపించింది. అది వినిపించుకునే మూడులో లేదు అప్పారావు.

అప్పారావు ఆరేళ్ళ కొడుకు తండ్రి బుజం తట్టి మళ్ళీ పిలిచాడు. "ఛీ... ఛీ... వెధవా! బైటికి పో..." అని విదిలించికొట్టాడు. ఇక లాభం లేదనుకుని శోకరాగయుక్తంగా విజృంభించాడు అప్పారావు కొడుకు.

"నాన్న... రాత్రి మనింట్లో దొంగలు పడి... అమ్మను మంచానికి కట్టేసి..."

"అమ్మను మంచానికి కట్టేసి..." అనే చివరి మాటలు మాత్రమే అప్పారావు చెవిన పడ్డప్పటికీ, అవి ఆటం బాంబుల్లా పని చేశాయి అతని మెదడుపై.

"ఏంట్రా... ఏంటి? ఏమైంది?" కంగారుగా అడిగాడు అప్పారావు.

"రాత్రి మనింట్లో దొంగలు పడి... అమ్మ నోట్లో గుడ్డలు కుక్కి... మంచానికి కట్టేసి..."

"ఆ కట్టేసి ఏం చేశార్రా..."

"కట్టేసి... కట్టేసి... ఏమో నాకు తెలీదు. మన ఇంటి ముందు... బోల్డు మంది జన మున్నారు. నిన్ను రమ్మంటున్నారు". ఈ మాటకు అప్పారావునెత్తిని "స్కైలాబ్" పడ్డంత పనైంది. చేతిలో వున్నది "డీల్ షో" అనే విషయం మర్చిపోయి "డ్రాప్" చేసి పిల్లాడిని తీసుకుని ఇంటికి పరిగెత్తాడు.

ఇంటి ముందు వంద మంది దాకా జనం గుమికూడి వున్నారు. అప్పారావుని చూసి అందరూ దారిచ్చారు. కంగారుగా ఇంట్లో

## పురుషులకు మాత్రమే



ఆరోగ్యం, అందచందాలు, ఫాషన్లు, దుస్తులు, నడవడిక యిలాటి విషయాలు గురించి 'స్త్రీలకు మాత్రమే' సూచించే శీర్షికలు పత్రికలు వ్యాసాలు కోకొల్లలుగా వస్తున్న ఈ కాలంలో - రూపం, వర్చస్సు, దేహదారుఢ్యం మగవారికి ఎంతో అవసరమని పాపం వారికే తెలియని ఈ కాలంలో **'పురుషులకు ప్రత్యేకం'** అనే కొత్త శీర్షికను 'మగవారి కోసం మాత్రమే' ప్రవేశ పెడుతున్నాము.

యువతరాన్ని నవతరాన్ని మాత్రమేగాక అందరు సుబ్బారావులను, సురేష్‌లను రమేష్‌లను, సూన్నారాయణ్ణి, సత్తెన్నారాయణమూర్తిని, నరసింహాన్ని, పున్నయ్యనీ, పురుషోత్తాన్ని కూడా ఈ శీర్షిక ఆకర్షించి తీరాలని ఆశిస్తున్నాము.

అన్నట్లు యిది మనకు రాసిపెట్టిన అబ్బాయి

'మేఘన ఫేమ్' చిరంజీవి పుట్టగుంట గోపీచంద్

మీరీ వ్యాసాలు చదివాక మునుపటి సుబ్బారావుల్లా వుండరు.
మీలో కొత్త మార్పును ప్రవేశ పెట్టే వ్యాస పరంపర
'పురుషులకు మాత్రమే'-
దసరా సంచిక **2-10-87** నుంచి ప్రారంభం!

— ఎడిటర్

కెళ్ళాడు. పడక గదిలో ఒక పక్కగా వేసి వున్న మంచంపై చాంతాడు వేసి వుంది. మంచానికి అనుకుని, చేతుల్లో మొహం దాచుకుని వెక్కి వెక్కి ఏడుస్తూంది అప్పారావు భార్య.

భర్త రాకను గమనించి శోకోధృతి మరి కాస్త పెంచింది. అప్పారావుకు ఏం చెయ్యాలో తోచలేదు. బైట కోలాహలం మరి కాస్త పెరిగింది. గుమ్మం వైపుకు రెండడుగులు వేశాడు. బైట నించున్న మనుషులు తమ వాక్ స్వాతంత్ర్యాన్ని వినియోగపరుచుకుంటున్నారు.

"వీడు ఒట్టి పోరంబోకు కదండీ... ఇరవై నాలుగు గంటలూ పేకాటే... పాపం ఆ ఇల్లాలు కనుక భరిస్తూంది!"

"ఏం భరిస్తే ఏం లాభం - జరగాల్సిందంతా జరిగింది. వీడు తిన్నగా వుండి ఏడిస్తే పాపం ఆవిడకు ఈ గతి పట్టేదా!"

"ఇంత పేకాట వ్యసనం వున్నవాడు అసలు పెళ్ళెందుకు చేసుకున్నట్టు? పిల్లల్నెందుకు కన్నట్టు? ఏ పేక దస్తాకో తాళి కట్టి — ఏ క్లబ్బులోనో కాపురం పెట్టాల్సింది!"

ఈ మాటలన్నీ అప్పారావు చెవులకు తూటాల్లా తగుల్తున్నాయి. అరికాలి మంట నెత్తికెక్కినట్టయింది. అందర్నీ అక్కడి నుంచి వెళ్ళిపొమ్మని గట్టిగా కసిరి కొట్టాడు. పది నిమిషాల్లో అంతా నిష్క్రమించారు.

అప్పారావు లోపలి కొచ్చి భార్య పక్కన కూర్చుని ఏం జరిగిందో అడగటానికి వుపక్రమించాడు. కానీ ఇంతలో అతని భార్య అతని ఒళ్ళో పడి బావురుమంది. అప్పారావు భార్య తల నిమిరి ఊరుకోబెట్టడానికి ప్రయత్నిస్తూ — పక్కనే నించున్న పార్వతమ్మగారిని అడిగాడు ఏం జరిగిందని.

"ఏముంది నాయనా... ఊర్లో దొంగల బెడద ఎక్కువగా వుందని నీకు తెలుసుగా... రాత్రి అమ్మాయి బాత్ రూంకు వెళ్ళాల్సి లేచిందట. దొడ్డివేపు గుమ్మం తలుపు తెరిచే సరికి ... దొంగ ముండా కొడుకులు పొంచి కూర్చున్నట్టున్నారు, హఠాత్తుగా అమ్మాయి మీద పడి, నోరుమూసి, అమాంతం లేపుకొచ్చి ఈ మంచంలో పడేసి, చాంతాడుతో కట్టేసి, నోట్లో గుడ్డలు కుక్కి డబ్బు కోసం ఇల్లంతా వెతుక్కున్నారట. దొంగ ముండా కొడుకులకు ఏవీ దొరకలేదు కామోసు - ఆ కోపంతో అమ్మాయి మీద ఏదో అత్యాచారం కూడా చెయ్యటానికి ప్రయత్నించారట. ఇంతలో సమయానికి ఈ వీధి గూర్ఖావాడు ఇటుగా పోతూ లాఠీ చప్పుడు చేసేసరికి దొంగలు పరారయ్యారట. పొద్దుటే మా ఇంట్లో కాఫీ పెడదామని చూస్తే పంచదార కాస్తా అయిపోయి ఒక కప్పు బదులడుగుదాం కదాని వస్తే ఇంకేముంది....నా నోట మాట రాలేదు నాయనా ఆ దృశ్యంచూసి! పిల్లలు వొళ్ళు మరచి నిద్రపోతున్నారు. అమ్మాయి మంచానికి కట్టి పడేసి వుంది. అరవ కుండా నోటి నిండా గుడ్డలు కుక్కివున్నాయి. ఏమిటో నాయనా నేను నీకు చెప్తున్నానని కాదు... ఆ పిల్లకు ఈ గతి పట్టిందంటే కారణం నువ్వు ఇంటి పట్టున వుండకపోవడమేగా! సమయానికి ఆ గూర్ఖావాడు రాకపోతే అమ్మాయి బతుకు ఏమైపోయేది?! నేను అన్నానని కాదు కానీ కాస్త ఆలోచించు. ఒస్తా నాయనా — ఇంత వయసొచ్చినా ఒక గంట కనబడకపోతే మీ బాబాయిగారు నన్ను వెతుక్కుంటూ వచ్చేస్తారు" అంటూ పక్క వాటా పార్వతమ్మగారు వెళ్ళిపోయారు.

ఆ రోజు పగలంతాకూడా ఎటూ వెళ్ళకుండా ఇంట్లోనే గడిపాడు. రాత్రి పెందలాడే పిల్లలిద్దరూ భోజనాలు చేసి నిద్రపోయారు. తొమ్మిది గంటలు కూడా కాకుండానే భార్యా సమేతంగా పక్క మీదకి వచ్చాడు అప్పారావు.

భర్త గుండెలపై తల పెట్టి తృప్తిగా నిట్టూర్చింది. ఆరు సంవత్సరాల తర్వాత భర్త అప్యాయంగా అక్కున చేర్చుకున్న ఆ సమయంలో తన పెళ్ళినాటి తొలి రోజులు జ్ఞప్తికి వచ్చాయి అప్పారావు భార్యకు.

తన భర్త తనకు చేరువవటానికి పక్కింటి పార్వతమ్మగారు తనతో ఆడించిన ఈ "షో" ఇంత సక్సెస్‌ఫుల్‌గా "డీల్ షో" అవుతుందని అనుకోలేదు అప్పారావు భార్య.

పక్కింటి పార్వతమ్మగారికి మనసులోనే హృదయ పూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్న తరుణంలో అప్పారావు తన భార్య అధరాలను లాలనగా తన పెదవులతో మూసేశాడు.